

విద్యార్థులకు ఇంపాక్ట్ ప్రేరణ తరగతులు

గాంధారి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేట్‌సంగెం విద్యార్థులకు ఇంపాక్ట్ గంప నాగేశ్వర్‌రావు వారి సంస్థ ప్రేరణ తరగతులు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు కుమార స్వామి తెలిపారు. సంస్థ ట్రెయినర్స్ శేఖర్, రాజేష్, సంతోష్‌రెడ్డి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు ఎలా చదవాలి, విజ్ఞానాన్ని ఎలా సంపాదించాలనేది వివరించారు. తల్లిదండ్రుల ఆశయాలను, ఉపాధ్యాయుల కృషిని నెరవేర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఇంటిగ్రేటెడ్..
రెసిడెన్షియల్ స్కూల్



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నమూనా

- జుక్కల్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు
- మద్నూర్‌లో ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- 20 నుంచి 25 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో పాఠశాల భవనం
- 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధన
- 2,560 మంది విద్యార్థులకు అవకాశం
- ప్రస్తుతం జిల్లాలో 60కి పైగా రెసిడెన్షియల్ స్కూళ్లు

కామారెడ్డి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో రేవంత్ సర్కార్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా పలు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేసి భవన నిర్మాణాలను చేపడుతుంది. అయితే ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా రెండో విడత కింద రాష్ట్ర వ్యాప్తంగా 26 రెసిడెన్షియల్ స్కూల్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కామారెడ్డి జిల్లాలో జుక్కల్ నియోజకవర్గానికి ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. వెనుకబడిన ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గానికి ఈ స్కూల్ మంజూరు చేయడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందనుంది. త్వరలోనే ఈ స్కూల్ నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంది.

మద్నూర్‌లో ఏర్పాటు చేసే అవకాశం

జుక్కల్ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసింది. నియోజకవర్గ పరిధిలో జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, డోంగ్లి మండలాలు ఉన్నాయి. అయితే ఈ రెసిడెన్షియల్ స్కూల్‌ను మద్నూర్ మండలంలో ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రకటించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాన్ని నిర్మించేందుకు సుమారు 20 నుంచి 25 ఎకరాల స్థలం అవసరం కానుంది. ఇంత మొత్తంలో ప్రభుత్వ స్థలం మద్నూర్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మద్నూర్‌లోని సోమలింగాల గుట్ట సమీపంలో 50 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో 25 ఎకరాల్లో ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం భవనాన్ని నిర్మించేందుకు అనువైన స్థలంగా అధికారులు భావిస్తున్నారు. దాదాపు ఇక్కడే భవన నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంది.

2,560 మంది విద్యార్థులతో పాఠశాల

రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఒక్కో దాంట్లో 2,560 మంది విద్యార్థులకు విద్యా బోధన అందించే అవకాశం ఉంది. విద్యార్థులు నాలుగవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకోనున్నారు. ఈ పాఠశాలలో వేర్వేరు బ్లాక్‌లు ఉంటాయి. ప్రతీ స్కూల్‌లో 30 మంది చొప్పున 120 మంది ఉపాధ్యాయులు పని చేయనున్నారు. అలాగే లైబ్రరీలో 5వేల పుస్తకాలు, కంప్యూటర్ కేంద్రంలో 60 కంప్యూటర్‌లు ఉండనున్నాయి. అన్ని తరగతి గదుల్లో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యా బోధనలు చేయనున్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాలు నిర్మించే ప్రాంతాల్లో 25ఏళ్ల క్రితం నుంచి అక్కడి ఉష్ణోగ్రతలు, వర్షపాతం, చలి, వేడిగాలుల తీవ్రత తదితర వాతావరణ అంశాలను ఆరికిటెక్ట్ సంస్థ పరిగణలో ఉంది. వాతావరణానికి అనుకూలంగా భవనాలను నిర్మించనున్నారు. ప్రతీ డార్మిటరీ గదిలో 10బెడ్లు, రెండు బాత్రూంలు ఉండేలా ప్రణాళికలు చేశారు.

అత్యాధునిక విద్యా ప్రమాణాలతో..

విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, పరిసరాల అవసరాలకు అనుగుణంగా యువ గ్రాడ్యుయేట్‌లు, నిరుద్యోగుల నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధనలు చేసేవిధంగా ఏర్పాట్లు చేయనున్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఐటీ, ఆవిష్కరణలను ప్రోత్సహించే విధంగా విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుంది. పాఠశాలలు, ఇంటర్మీడియట్ విద్య ద్వారా అట్టడుగు స్థాయి అభివృద్ధిని ఎక్కువగా ప్రైవేట్ రంగానికి వెళ్లి ఫీజులు చెల్లించలేకపోతున్నారు. ఇందులో భాగంగా కార్పొరేట్ స్థాయి విద్యాబోధనలు అందించాలనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి నాలుగవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యా బోధనలను అందించాలని నిర్ణయించింది. డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీలతో సహా కళా బోధన సౌకర్యాలు, అత్యాధునిక వసతులతో పాఠశాలలను నిర్మించనున్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో తరగతి గదులు, ల్యాబరోటరీలే కాకుండా ఇండోర్‌స్పోర్ట్స్, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బాస్కెట్ బాల్, అవుట్‌డోర్ జిమ్, థియేటర్ వంటి సౌకర్యాలను కల్పించనున్నారు.

ప్రస్తుతం జిల్లాలో 60 రెసిడెన్షియల్ స్కూళ్లు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం 60కిపైగా రెసిడెన్షియల్ స్కూల్‌లు ఉన్నాయి. ఆయా రెసిడెన్షియల్ స్కూళ్లలో వేల మంది విద్యార్థిని,విద్యార్థులు విద్యాబోధన చేస్తున్నారు. 19 కేజీబీవీలు, 11 సొసైటీ స్కూల్‌లు, మైనార్టీ వెల్ఫేర్ స్కూల్‌లు 6, మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే పాఠశాలలు 8, ఆదర్శ పాఠశాలలు 6, 4 ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లు, ఒక్కొక్కటి చొప్పున అర్బన్ రెసిడెన్షియల్, ఆశ్రమ రెసిడెన్షియల్, ఇతర పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక హంగులతో ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను జుక్కల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్నారు.

అధికారులు సమష్టిగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌షెట్కార్

ఎంపీ సురేష్ షెట్కార్

కామారెడ్డి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు సమష్టిగా పని చేయాలని ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో దిశ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ లోక్‌సభ ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిసారిగా దిశ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని నిర్వహించామన్నారు. అన్నిశాఖల అధికారుల సహకారంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమ లు చేసే దిశగా పని చేయాలని తెలిపారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. దిశ సమావేశంలో వ్యవసాయం, విద్య, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమం, పౌర సరఫరాలు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, గనులభూగర్భశాఖ తదితర శాఖలపై ఆయా అధికారులు వివరించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 1,47,670మంది రైతులకు రూ.531.6 కోట్లు జమ చేశామ న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.9.68 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 2,535 పనులను 37.65 లక్షల పని దినాలు గుర్తించి 73 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జిల్లాలో 1,64,397 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్ల రూపేనా 36కోట్ల 75లక్షలను పంపిణీ చేశార న్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కింద నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం, గ్రామీణ సడక్‌యోజన కింద జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 15 పనులను 61.25 కోట్ల అంచనాలతో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 1193 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 50,957 మంది పిల్లలకు, 6,689 మంది గర్భిణులకు, 5,645 మంది బాలింతలకు అనుబంధ పోషకాహారం అందించబడుతుందని తెలిపారు. జిల్లాలో జాతీయ రహదారులపై రోడ్ సేఫ్టీ కింద అండర్ బ్రిడ్జి ఇంప్రూవ్‌మెంట్ పనులు చేపడతామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 1,168 ఇళ్ల నిర్మాణాలకుగాను 1,167 పూర్తయ్యాయని తెలిపారు. జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం, జనని శిశు సురక్ష కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నాయని తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గర్భిణులకు ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు, మందుల సరఫరా, ఉచిత కాన్పు, ఉచిత భోజనం, రవాణా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు ఇందుప్రియ, గంగాధర్, శ్రీకాంత్, దిశకమిటీ సభ్యులు నర్షియా నాయక్, దేశ్‌ముక్ రాజు, నరేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివృద్ధి కావాలా.. ప్రొటోకాల్ కావాలో ఆలోచించాలి?



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

- కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే అడ్డు నిలుస్తున్నాడు
- కామారెడ్డికి రావాల్సిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ జుక్కల్‌కు వెళ్లింది
- డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి కావాలా.. ప్రొటోకాల్ కావాలో ఆలోచించాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అడ్డుగోడలా నిలుస్తున్నాడని అన్నారు. అన్ని వసతులు ఉన్న కామారెడ్డి నియోజకవర్గానికి రావాల్సిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల జుక్కల్‌కు తరలివెళ్లిందని, రాష్ట్రంలో 13 నర్సింగ్ కళాశాలలు వస్తే కామారెడ్డికి ఒక్కటి కూడా రాలేదని అందుకు ఎమ్మెల్యే వైఖరే కారణమని అన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఎంతో కష్టపడి అభివృద్ధికి నిధులు తెస్తే దానిపై కూడా విజిలెన్స్‌కు ఫిర్యాదులు చేసి అభివృద్ధి అడ్డుకుంటున్నాడని అన్నారు. నిజామాబాద్, ఆర్మూర్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్‌చార్జీలతో కలిసి అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నారని ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించిన అని చెప్పుకుంటూ మెనార్క్, సైకో చేష్టలు చేయడంతో ప్రభుత్వ అధికారులు కూడా సెలవులపై వెళ్తున్నారని అన్నారు. అధికారులు ఎవరైన రావడానికి జంకుతున్నారని అన్నారు. డిగ్రీ కళాశాల భూముల్లో అవినీతి చేసి అన్యాక్రాంతం చేశావని, ఆరోరా కళాశాల వారికి అప్పనంగా 26 ఎకరాలు అందించడంతో దానిపై వారు రూ.17 కోట్ల అప్పు చేశారని దాంట్లో వారు దోచింది ఎంత.. నీకు ఇచ్చింది ఎంతా అని ప్రశ్నించారు. సొంత నిధులు రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తానని అబద్దపు ప్రచారాలు చేసి గెలిచి కామారెడ్డి ప్రజలను నట్టేట ముంచాడని అన్నారు. సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను షబ్బీర్‌అలీ మంజూరు చేయిస్తే ప్రొటోకాల్ ప్రకారం చెక్కులు నేనేపంచుతానని సీఎం ఆఫీసులో ధర్నాకు కూర్చున్నాడని దీంతో షబ్బీర్‌అలీ ఎవరు పంచితే ఏం దని వెనక్కి తగ్గారని అన్నారు. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు ఆధిక్యం ఇచ్చారని తెలిపారు. ప్రజల కోసం కష్టపడుతూ సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే షబ్బీర్‌అలీతోనే విద్యా సంస్థలు, సాగు నీరు, తాగు నీరు, ప్రాజెక్టులు తీసుకురావడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, పండ్ల రాజు, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, భీంరెడ్డి, గాల్‌రెడ్డి, మోహన్ రెడ్డి, గోనె శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, గుడెం శ్రీనివాస్‌రెడ్డి, కారంగుల అశోక్‌రెడ్డి, యాదవరెడ్డి, నౌసిలాల్ నాయక్, గుడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో..
వలస కూలీలదే ప్రధాన పాత్ర!



మాల్తుమ్మెదలో ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న బిహార్ కూలీలు

- నాగిరెడ్డిపేటకు బిహార్ నుంచి వలస వచ్చిన కూలీలు
- కొనుగోలు కేంద్రాల ద్వారా కూలీలకు ఉపాధి
- ధాన్యం కొనుగోళ్ల సీజన్‌లో ఇక్కడ చేతి నిండా పనులు
- రోజుకు రూ.వెయ్యి వరకు సంపాదన
- 'ఆంధ్రజ్యోతి'తో వలస కూలీల మనోగతం

నాగిరెడ్డిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాల క్రితం మన రాష్ట్రంలో పనులు లేక, పనులు దొరకక గ్రామీణ ప్రాంతాలకు చెందిన చాలా మంది కూలీలు నాడు ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టి తెలంగాణకు, నేడు ఇతర రాష్ట్రాల వలస కూలీలు వరుస పెట్టి వస్తున్నారు. వ్యవసాయరంగంలో ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో అధిక వ్యవసాయ విస్తీర్ణం, అధిక పంటల సాగు జరుగుతుంది. అత్యధిక శాతం రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి వరి పంటను సాగు చేస్తుండటంతో వ్యవసాయ కూలీల అవసరం బాగా పెరిగింది. దీంతో ఇతర రాష్ట్రాల్లో ఉపాధి లేకపోవడంతో అక్కడి కూలీలు ఈ ప్రాంతానికి వలస కడుతున్నారు. బిహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర లాంటి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస కూలీలు వస్తున్నారు. తమ సొంత రాష్ట్రంలో పనులు లేకపోవడంతో రోజు కూలి దొరకకపోవడంతో తెలంగాణ రాష్ట్రానికి తాము వలస వస్తున్నట్లు వలస కూలీలు చెబుతున్నారు. ప్రస్తుతం వడ్ల కొనుగోళ్ల సీజన్ ముమ్మరంగా కొనసాగుతున్నందున ధాన్యం కొనుగోళ్లలో వలస కూలీలే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన బస్తాలను లారీల్లో లోడ్ చేయడం లాంటి పనులు చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో బిహార్ రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలు భారీగానే తరలివచ్చినట్లు తెలుస్తోంది.

నాగిరెడ్డిపేటకు 270 మంది బిహార్ వలస కూలీలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూలి పనులు చేసేందుకు బిహార్ రాష్ట్రం నుంచి 270 మంది కూలీలు నాగిరెడ్డిపేట మండలానికి వలస వచ్చారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద, తాండూర్ సొసైటీలు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వలస వచ్చిన బిహార్ కూలీలు పనులు నిర్వహిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యంను తూకం వేయడం, తూకం వేసిన ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేసే పనులను బిహార్ కూలీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో హమాలీ పనులు చేసేందుకు హమాలీలు లేక మండలంలోని మాల్తుమ్మెద, తాండూర్ సొసైటీల పరిధిలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేయడం కోసం సొసైటీల పాలకవర్గం, సిబ్బంది బిహార్ నుంచి కూలీలను రప్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సొసైటీలు బిహార్ కూలీల చేత ధాన్యం కొనుగోళ్ల పనులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మాల్తుమ్మెద, తాండూర్ సొసైటీల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 270 మంది బిహార్ కూలీలు ఇక్కడికి వచ్చారు. నెల రోజులుగా వారు ఇక్కడ పనులు నిర్వహిస్తున్నారు. తాండూర్ సొసైటీ పరిధిలో 12 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పని చేయడానికి బిహార్ రాష్ట్రం నుంచి 170 మంది కూలీలు ఇక్కడికి వలస వచ్చారు. అలాగే మాల్తుమ్మెద సొసైటీ పరిధిలో 12 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇందులో మూడు కేంద్రాల్లో స్థానిక హమాలీలు పనులు చేస్తుండగా మిగతా వివిధ గ్రామాల్లోని ఏర్పాటు చేసిన 9 కొనుగోలు కేంద్రాల్లో చేసేందుకు బిహార్ రాష్ట్రం నుంచి వంద మంది కూలీలు తరలి వచ్చినట్లు సొసైటీ సిబ్బంది తెలిపారు. బిహార్ రాష్ట్రంలో సుపోల్ జిల్లా నుంచి తాండూర్ గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. బిహార్ ఉంచి వచ్చిన కూలీలు ఆయా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యాన్ని తూకం చేస్తూ, ధాన్యం బస్తాలను లారీల్లో లోడ్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. వరి ధాన్యాన్ని తూకం చేసే హమాలీ పనులు చేయడంలో ధాన్యం బస్తాలను లారీల్లో లోడ్ చేయడంతో వీరికి మంచి నైపుణ్యం ఉందని ఇక్కడి రైతులు అంటున్నారు. రోజు తాము తమ ప్రాంతంలో కూలీ పనులు, హమాలీ పనులు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటామని, ప్రస్తుతం తమకు తమ ప్రాంతంలో చేసుకోవడానికి పనులు లేవని, దీంతో జీవనోపాధి లేక తెలంగాణ ప్రాంతానికి ఉపాధి కోసం తరలివచ్చినట్లు బిహార్ కూలీలు తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా తమకు ఇక్కడ ఉపాధి లభిస్తున్నట్లు తెలిపారు. సుమారు నెల రోజులకుపైగా ఈ కొనుగోలు కేంద్రాల్లో తమకు ప్రతీరోజు పనులు ఉంటాయని, దీంతో ఇక్కడ రోజు పనులు చేసి, సంపాదించిన డబ్బులను తమ ఇంటికి తీసుకెళ్తామన్నారు. ఒక క్వింటాల్ ధాన్యాన్ని తూకంవేసి, లారీలో లోడ్ చేసినందుకు తమకు రైతుల నుంచి రూ.36 నుంచి 40 రూపాయలు చెల్లిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పది మంది వరకు కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడి పనులు చేస్తున్నామని తెలిపారు. ప్రతీరోజు ఒక గ్రూపులోని పది మంది కలిసి ఒక రోజులో 800 ధాన్యం బస్తాలను తూకం వేసి, బస్తాలను కుట్టి, లారీలో లోడ్ చేస్తామన్నారు. ప్రతీ గ్రూప్ రోజు ఒక లారీల ధాన్యాన్ని తూకం చేసి లోడ్ చేస్తున్నట్లు వారు తెలిపారు. రోజుకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల వరకు కూలీ లభిస్తుందని వారు తెలిపారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సీజన్ పూర్తయ్యే వరకు ప్రతీ ఒక్కరు సుమారు 25 వేల నుంచి 30 వేల రూపాయల వరకు సంపాదించుకుని ఇంటికి తీసుకెళ్తామని బిహార్ కూలీలు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా బిహార్ కూలీలకు ఈ ప్రాంతంలో ఉపాధి లభిస్తుండటంతో బిహార్ కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనులు చేసేందుకు బిహార్ నుంచి వచ్చా..

• గోపాల్ పాస్వాన్, కూలీ



కూలి పనులు చేసేందుకు బిహార్ రాష్ట్రం నుంచి తెలంగాణకు వచ్చాను. తమది బిహార్ రాష్ట్రంలోని సుపోల్ జిల్లా మటియారి గ్రామం. మా ప్రాంతంలో పనులు లేవు. ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాకు రోజు చేతి నిండా పని లభిస్తోంది. రోజు ఉదయం నుంచి పనులు చేయడం ప్రారంభిస్తున్నాం. పది మందితో కలిసి పని చేస్తున్నాం. రోజు ఒక లారీ ధాన్యాన్ని తూకం చేసి, లారీల్లో లోడ్ చేస్తున్నాం. రోజు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల వరకు కూలి లభిస్తోంది. ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు ఇక్కడే ఉంటాం. ఇక్కడ పని చేసి సంపాదించిన డబ్బును కుటుంబ పోషణ కోసం తీసుకెళ్తా.

తెలంగాణలో ఉపాధి లభించింది

• ధర్మేందర్ యాదవ్, కూలీ



ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వల్ల తమకు తెలంగాణలో ఉపాధి లభించింది. మా రాష్ట్రంలో కూలి పనులు చేసే వారు చాలా మంది ఉంటారు. అందరికీ పనులు దొరకవు. అక్కడ పనులు లేక ఇంత దూరం వచ్చి పనులు చేస్తున్నాం. ఇక్కడ ప్రతీరోజు పని లభిస్తోంది. రూ.900 నుంచి వెయ్యి రూపాయల వరకు సంపాదిస్తున్నాం. నెల రోజులు కష్టపడి పని చేసి సంపాదించిన డబ్బులు ఇంటికి తీసుకువెళ్తా.

పత్తి కొనుగోళ్లలో నిబంధనలకు నీళ్లు



- లైసెన్స్ లేకపోయినా దర్జాగా దందా
- ఇష్టారాజ్యంగా కమీషన్ వసూలు
- నష్టపోతున్న రైతులు

7

పాత నాణేలు, నోట్ల సేకరణ



- 35 ఏళ్లుగా పాత నాణేలు, నోట్లను సేకరిస్తున్న నవీపేట వ్యాపారి మహేష్ గుప్తా

7

రైతులు కూరగాయలు పండించాలి

● వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

మోపాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు కూరగా యలను కూడా పండించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగా రెడ్డి అన్నారు. మోపాల్ మండల కేంద్రంలో ఓ రైతు తన పొలంలో కూరగాయలను పండిస్తున్న పంటను శనివారం సందర్శించి పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను పండించడం సంతోషకరమన్నారు. రైతును ఆదర్శంగా తీసుకొని మిగతా రైతులు కూడా తమ పొలాల్లో వివిధ రకాల కూరగా యలను పండించుకోవడం వల్ల అధిక లాభాలను పొందుతారని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఉన్నారు.

రైతులకు అండగా సీఎం..

రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా ఉన్నారని ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. శనివారం మోపాల్ మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, సొసైటీ చైర్మన్లు మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, వైస్‌చైర్మన్ రాజాకిషన్, మాజీ జెడ్పీటీసీ మోహన్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య నూతన భవన నిర్మాణానికి నిధులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లా సమాఖ్య నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్లు డీఆర్‌డీవో సాయాగౌడ్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగం గా సంఘాల్లో లేని వారిని సంఘాల్లో చేర్పించాలని కోరారు. సంస్థాగత నిర్మాణం, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఫామ్, నాన్‌ఫామ్ మండల సమాఖ్య, గ్రామ సమస్యల ఆడిట్‌పై చర్చించారు. సెర్ప్ అధికారిణి భారతి, డీపీఎంలు సంధ్యారాణి, సాయిలు, శ్రీనివాస్, మారుతి, స్త్రీనిధి ఆర్‌ఎం రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్‌లో దొంగతనం

మోపాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్‌లో ఉన్న మెడిలైఫ్ ఫార్మసీలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారని షాపు యజమాని అజయ్‌కుమార్ శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించారు. 2లక్షల నగదు పోయినట్లు బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

● పీఆర్‌టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందని పీఆర్‌టీయూటీఎస్ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడితో కలిసి జిల్లా పీఆర్‌టీయూ కార్యాలయంలో మాట్లాడారు. 1998 డీఎస్సీలో రాష్ట్రస్థాయిలో 43వ ర్యాంకు సాధించి మెదక్ జిల్లాలో 24ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశానని, సేవాదృక్పథంతో ఉపాధ్యాయులకు మరింత సేవ చేయాలనే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ఆదివారం నగరంలోని టీఎల్ఎన్ గార్డెన్‌లో ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగోని కిషన్, హైదరాబాద్ పీఆర్‌టీయూ టీఎస్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రచ్చ మురళి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు

● ఆకట్టుకున్న బాలవికాస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



పతాక ఆవిష్కరణలో పాల్గొన్న భక్తులు

ధర్పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఓంకారం, జ్యోతిప్రజ్వలన, సుప్రభాతం, స్వామి పాదుకార్చన, ధ్వజారోహన, అనంతరం బాల వికాస్ పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, హారతి, మధ్యాహ్నం అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జయంతి సందర్భంగా బాల వికాస్ చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం పల్లకిసేవా కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గత 90 రోజులుగా ఉదయం 5గంటలకు సాయి భక్తులు చేసిన నగర సంకీర్తన కార్యక్రమం జయంతి సందర్భంగా ముగిసాయి. రాత్రి సత్యసాయి సేవా సదన్‌లో భజన కార్యక్రమాలు నిర్వహించి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ధర్పల్లి సత్యసాయి సేవా సమితి భక్తులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో..

నిజామాబాద్ కల్చరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 98వ జయంతి ఉత్సవం శనివారం జిల్లా సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సాగాయి. జయంతి ఉత్సవంలో భాగంగా ఉదయం ఓంకారం, నగర సంకీర్తన, బాలవికాస్ చిన్నారులచే కేక్ కటింగ్, లింగానికి రుద్రాభిషేకం, వేదపఠనం, భజనలు సాగాయి. సాయంత్రం సేవాసమితి ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో సత్య సాయిబాబా ఫోటో ఉంచి డోలారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సత్యసాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతలింగయ్య స్వామి ఉత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్దబజార్‌లోగల పోతలింగయ్య స్వామి కార్తీకమాస ఉత్సవాలు శనివారం ఘనంగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా దేవతా మూర్తులకు వేదమంత్రాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో ప్రత్యేక పుష్పార్చన, విశేష పూజలు జరిపారు. అనంతరం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాదంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఎమ్మెల్యేను కలిసిన గుట్టకింది తండావాసులు

ఇందల్వాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టకింది గ్రామ పెద్దలు, వీడీసీ పెద్దలు, గ్రామస్తులు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తాండా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, గుట్టకింది తాండా మాజీ సర్పంచ్ మోహన్ నాయక్, మాజీ ఎంపీటీసీ పరుశురాం నాయక్, తిర్మన్‌పల్లి మాజీ ఎంపీటీసీ కిషన్, తాండా పెద్దలు శివరాం నాయక్, తండా నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సబ్బనిలత మాట్లాడుతూ నగరంలోని కంఠేశ్వర్ శివారులోగల సర్వే నంబరు 168 ప్రభుత్వ స్థలంలో గత ఏడాదికాలంగా పేదలు గుడిసెలు వేసుకొని అక్కడే నివసిస్తున్నారని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ స్థలంలో ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేస్తామని వాగ్దానం చేశారని కానీ ఇప్పటికీ ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించినందున సర్వే నంబరు 168లో పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మౌనిక, జీజాబాయి, వాణి, ఉషా, పద్మిని, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రగతినగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడిఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. 11కెవి లైన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రగతినగర్‌తో పాటు కానుగంటి గార్డెన్‌లో ఉదయం 11గంటల నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్యాణం.. కమనీయం

● ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ధర్పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో ఆలయంలో వివిధ భక్తికార్యక్రమాలు నిర్వహించారు. శనివారం శ్రీవారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పూర్ణాహుతి, డోలారోహనం, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. బోలేవార్ మఠాధిపతి కిరణ్‌శాస్త్రి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ నల్లసారిక హన్మంత్‌రెడ్డి, బ్రహ్మోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



గడుగును సన్మానిస్తున్న రాష్ట్ర ఆదర్శ రైతులు

గడుగును సన్మానించిన ఆదర్శ రైతులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమీషన్ మెంబర్‌గా నియమితులైన గడుగు గంగాధర్‌ను శనివారం నల్గొండ, వరంగల్, సూర్యపేట నియోజకవర్గాలకు చెందిన ఆదర్శ రైతులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆదర్శ రైతు రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులు గడుగును సన్మానించగా గడుగు సైతం వారిని శాలువాలతో సన్మానించారు.

భారత సైకియాట్రిక్ జాతీయ సదస్సుకు డాక్టర్ విశాల్



డాక్టర్ విశాల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

సుభాష్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత ప్రైవేటు సైకియాట్రిక్ అసోసియేషన్ 25వ జాతీయ సదస్సుకు జిల్లాకు చెందిన ప్రముఖ సైకియాట్రిక్ డాక్టర్ విశాల్ హాజరయ్యారు. ఈ సదస్సు నవంబర్ 21నుంచి 24వరకు మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన డాక్టర్ విశాల్ మెటబోలిక్ డిజాస్టర్ సైకియాట్రిక్ సమస్యలు వాటి నిర్వాహణ అనే అంశంపై ప్రత్యేకవక్తగా హాజరై మాట్లాడారు. మెటబోలిక్ డిజాస్టర్‌కు సంబంధించి డిప్రేషన్, ఆందోళన, ఒత్తిడితో కూడిన లక్షణాలపై విలువైన సలహాలను అందించారు. షుగర్, బీపీ, కొలస్ట్రాల్ వంటి మెటబోలిక్ డిజాస్టర్‌ఉన్న రోగులు భయం, గుండెదడలు, నిద్రలేమి, దుఃఖం, ఆత్మహత్య భావనలు అనుభవిస్తారని విశాల్ పేర్కొన్నారు. దీన్ని అధిగమించేందుకు బీపీ, షుగర్, కొలస్ట్రాల్ మందులతో పాటు ఆందోళన డిప్రేషన్ కూడా సమర్థవంతంగా చికిత్స చేయడం ముఖ్యమని సూచించారు. ఈసందర్భంగా నిర్వాహకులు డాక్టర్ విశాల్‌ను ఘనంగా సత్కరించారు.

'బోనస్ ఇచ్చి మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్'

ఇందల్వాయి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ మాట నిలబెట్టుకుందని కాంగ్రెస్ పార్టీ డీసీసీ డెలిగేట్ తలారి సుధాకర్ సంతోషం వ్యక్తం చేశారు. రైతులు, ప్రజల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ వంటి పథకాలను అమలు చేయడం దేశానికే గర్వకారణమని అన్నారు. మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరిస్తామని, సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందని, ఇచ్చిన మాట ప్రకారం నేడు రైతుల ఖాతాల్లో జమచేయడం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మండల రైతులు తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన కాల భైరవ స్వామి ఆలయం

● కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ● భక్తులకు ఘనంగా అన్నదానం ● అంబరాన్నంటిన భైరవ స్వామి సంబురాలు



కాలభైరవ స్వామి, ఆలయానికి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

రామారెడ్డి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కామారెడ్డి జిల్లా కేంద్రానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇసన్నపల్లి- రామారెడ్డి మండలం మధ్యలో ఉన్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో శనివారం భక్తుల తాకిడితో ఆలయం దద్దరిల్లింది. ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ, పురోహితులు మంత్రోచ్చరణలతో సంతతు ధారాభిషేకం, డోలారోహణం, మహా పూజ, దక్షయజ్ఞం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సింధూర పూజ, పాలాభిషేకం తదితర వాటితో పాటు కాలభైరవ స్వామి బంగారు విగ్రహాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రం చెందిన బ్యాంకు నుంచి రామారెడ్డి ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు మధ్య ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంతుళ్ళ మంత్రోచ్చారణలతో శ్రీ కాలభైరవ స్వామి బంగారు విగ్రహాన్ని తొట్టిలో వేసి భజా భజంత్రీలతో నామస్మరణ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు శ్రీ కాలభైరవ స్వామి ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను ఊరేగింపు నిర్వహించారు. వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్, మెదక్, రాజన్న, సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, జగిత్యాలతతో పాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల తదితర జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, బెంగుళూరు తదితర రాష్ట్రాల భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలోపోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ల ప్రభురాం చంద్రం గుప్తా, గంజీ సతీష్ గుప్తా, మాలతి గుప్తా, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కమ్మ సంఘం ఆధ్వర్యంలో
కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం

బోధన్‌రూరల్,నవంబరు23(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని కమ్మ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు కమ్మ సంఘం అధ్యక్షులు పల్లెంపాటి శివన్నారాయణ, దావులూరి హరినాథ్ బాబు, పల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. శనివారం బోధన్‌లోని కమ్మ సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 8వ వార్షికోత్సవ కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, డాక్టర్ శ్రీమతి కోడె సుచరిత, ముమ్మాలనేని రాజశేఖర్, మండవ వెంకటేశ్వర్ రావు, ముమ్మాలనేని అమర్‌నాథ్ బాబు, పూదోట రవి కిరణ్ తదితరులు ముఖ్య అతిథులు హజరుకానున్నారన్నారు. కార్యక్రమానికి కమ్మ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆదివారం ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు ఆటపాట పోటీలతో పాటు కార్తీక వన భోజన కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ పావులూరి వెంకటేశ్వర్ రావు, చెదలవాడ వెంకటేశ్వర్ రావు. ఏ.పాపారావు, తలసాని శ్రీకాంత్, పల్లెంపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు టీయూ విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరగనున్న గణతంత్ర్య దినోత్సవ ఉత్సవాలకు టీయూ విద్యార్థులు తరుణ్, సింధూజ లను టీయూ వీసీ యాదగిరి రావు ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణకు కాంటిన్‌జెంట్ లీడర్‌గా వ్యహరించిన డా.సుమలత అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆర్మూర్ ను తెలంగాణ యూనివర్సిటీ నుంచి ప్రీపరేడ్ కు క్యాంపు 2024 లో పాల్గొన్న వీరిని వర్సిటీ వీసీ యాదగిరి రావు రిజిస్ట్రార్ యాదగిరి అభినందించినట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి తెలిపారు. జల్గాన్ లో నిర్వహించిన ప్రీరిపబ్లిక్ డే పరేడ్ క్యాంపులో ఎంపికైన ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు 2025 జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర్య వే డుకల్లో పాల్గొంటారని ప్రోగ్రాం ఆఫీసర్ తెలిపారు.

కొత్త రేషన్ కార్డులు రాక తిప్పలు

● కొత్త రేషన్ కార్డుల కోసం ఎదిరిచూపులు ● కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించాలని వినతులు



డొంకేశ్వర్ తహసీల్దార్ కార్యాలయం

డొంకేశ్వర్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): సంవత్సరా లుగా రేషన్‌కార్డులు మార్పులు చేర్పుల ప్రక్రియ జరగక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. దుబాయి వెళ్ళినవారు కొత్తగా పెళ్ళయిన సంతా నం కలిగిన వారి వివరాలను నేటికి రేషన్‌కార్డులలో నమోదు చేసుకోక అవస్థలు పడుతున్నారు. డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా 13 రేషన్ దుకాణాలు ఉండగా అం దులో 5592రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డుల్లో పేరు నమోదు చేసుకోవడానికి అనేక సంఖ్యలో దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డు లేక ప్రభుత్వం సంక్షే మ పథకాలను పొందని వారికి సంఖ్య ప్రతీ ఏటా తగుతూ వస్తుంది. గతంలో ఉన్న కుటుంబ సభ్యుల పేర్లు మాత్రమే రేషన్‌కార్డులు ఉండడం అనం తరం సదరు కుటుంబంలోకి పెళ్లయి పిల్లకు జన్మనిచ్చి దుబాయిలో ఉండి ఇంటికి వచ్చిన వారి వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడం ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా మరణిస్తే వారి పేర్లను తొలగించినంత త్వరగా కొత్త వారి పేర్లను నమోదు చేయకపోవడం విడ్డూరంగా ఉందని, గత ప్రభుత్వంపై నిరాశ చెంది ఉన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్‌కార్డు న మోదు ప్రక్రియ త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించడంతో ప్రజలు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు కొత్త పేర్లు నమోదు నూతన రేషన్‌కార్డు కోసం విడి విడిగా దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తుల ప్రక్రియ తొందరగా ప్రారంభించాలని గ్రామీణ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పదేళ్ల నుంచి ఎదురుచూపు



12ఏళ్ళ క్రితం దుబాయికి వెళ్ళాను. తిరిగి వచ్చి పదేళ్ళ అవుతుంది. రేషన్‌కార్డులో పేరులేదు, మా కుటుంబసభ్యులతో పాటు పేరు నమోదు చేయాలని రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరిగి అలిసిపోయా. పదేళ్ళ నుంచి రేషన్ సరుకులు అందేదు. గ్రా మీణ ప్రాంతాల్లో రేషన్ నమోదు ప్రక్రియ వెంటనే ప్రారం భించాలి.

\- సంజయ్, డొంకేశ్వర్

ఆర్మూర్ నుంచి అరుణాచల్‌కు బస్

పెర్కిట్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్మూర్ నుంచి అరుణాచలంకు బస్సును శనివారం బయటు దేరింది. మెంటెనెన్స్ విభాగం ఇప్యూటీ ఆర్ఎం శంకర్ డిపోమేనేజర్ పి.రవికుమార్ ఎస్‌టీఐ పారు, ఎంఎఫ్ గంగాకిషన్, ఏడీసలు చక్రవర్తి, ఎన్‌వి.రెడ్డి, అశోక్, కాడిచర్ల నర్సయ్య, గంగాధర్‌లు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణ చుట్టు పక్కల ప్రజలు ఆర్మూర్ నుంచి అరుణాచలంకు బయలుదేరే బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), ఆర్మూర్ నియోజకవర్గానికి ఇంటి గ్రేటెడ్ స్కూల్ మంజూరుపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్య దర్శి జీవీ.నర్సింహరెడ్డి, అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్ జెస్సు అనిల్, ఆకుల శ్రీనివాస్, రోహిత్‌రెడ్డి, పొల్కం వేణు, పులి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మహిళ ఆత్మహత్య

బోధన్‌రూరల్,నవంబరు23(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి సమీపంలో గల కాలనీలో షేక్.హసినా(31)అనే వివాహిత మహిళ శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మృతురాలి తల్లి హస్సేన్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మృతురాలికి భర్త షేక్.అబ్దుల్ రషీద్, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

చాకుతో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

నవీపేట,నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీకి చెందిన షేక్.సోహెల్ అనే యువకుడిపై చాకుతో దాడి చేసిన అదే కాలనీకి చెందిన షేక్.గౌస్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. 18న రాత్రి షేక్.సోహెల్ పొట్టలో చాకుతో పొడవడంతో అతనికి తీవ్ర గాయాలైన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి నిందితుడు షేక్.గౌస్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా భీమన్న గజాల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, నవంబరు 23: ఆదివాసుల ఆరాధ్య దైవం భీమన్న దేవుడి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండంలోని హసాకొత్తూర్ లో శనివారం గ్రామ ఆదివాసి నాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న గజాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రత్యేక ఓటరు నమోదు చేసుకోవాలి

కోటగిరి,నవంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. కోటగిరి, పొతంగల్, రుద్రూర్ మండల కేంద్రాల్లో శనివారం పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు నమోదు కోసం శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వీలుంటుందని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి తహసీల్దార్ గంగాధర్, ఎంఈవో శ్రీనివాస్ రావు తదితరులున్నారు.

మోర్తాడ్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

మోర్తాడ్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), మండల కేంద్రంలో బద్దంవాడ శివారులోని వ్యవసాయ తోటలో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి తీగలను దొంగిలించారని ఎస్సై విక్రం తెలిపారు. మోర్తాడ్ నుంచి కమ్మర్‌పల్లి వెళ్ళే రోడ్డు పక్కన అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నుంచి కిందికి పడగొట్టి ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌కాయిల్స్‌ను దొంగిలించారని, విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ను జాగ్రత్తగా తీసుకోవాలని, రాత్రిల్లో అనుమానం ఉన్న వ్యక్తులు గుర్తించాలని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ట్రైబుల్ ఐటీఐలో సీట్లు సాధించాలి: డీఈవో

కమ్మర్‌పల్లి, నవంబరు 22: (ఆంధ్రజ్యోతి) పదవతరగతి విద్యార్థులు ఇప్పటి నుండే శ్రద్ధగా చదివి రానున్న వార్శిక పరీక్షల్లో 10 జిపిఏ సాధించి ట్రైబుల్ ఐటీఐలో సీట్లు సాదించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. శుక్రవారం మండంలోని ఉప్లూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పదవతరగతి విద్యార్థులకు పలుసబ్జెక్ట్‌లలో ప్రశ్ని ంచి జవాబులు రాబట్టారు. విద్యార్థుల ఫేర్‌నోట్స్, ఎన్ఏఎస్ ప్రశ్నపత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు 3,6,9 తరగతు లు విద్యార్థులను ఎన్ఏఎస్ పరీక్షలకు సిద్దంచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించా రు. ఉపాధ్యాయులు టీచర్స్ డైరీ రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో తోపాటు మం డల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య, హెచ్ఎంలు కే రాజన్న, గిరిధర్, ఉపా ధ్యాయులు దేవన్న, సల్లూరి కిషన్ గౌడ్, మాసం శ్రీనివాస్ గౌడ్, గుండోజి రవిందర్, తదితర ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌టౌన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), పట్టణంలోని దయానంద్ నగర్‌కాలనీలో మల్లికార్జున శివాలయం నిర్మాణానికి శనివారం పల్లిగుట్ట మంగిరాములు మహరాజ్ భూమిపూజ చేశారు. గత కొన్నేళ్ల క్రితం కాలనీలో శివలింగం, నంది వెలువడంతో భక్తులు షెడ్డు నిర్మించి ప్రతీరోజు పూజలు చేశారు. మందిర నిర్మాణాన్ని భక్తులు సంకల్పిం చుకొని మంగి రాములు మహరాజ్ చేతుల మీదుగా భూమిపూజ చేపట్టారు. ఈ కార్యక్ర మంలో కాలనీవాసులు కొడిగెల మల్లయ్య, పుప్పాల పోశెట్టి, సిద్దపురం రాజేశ్వర్, రాజేందర్, మహిళలు, తదిత రులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కోటగిరి,నవంబరు23(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హెగ్డోలి, కారేగాం ప్రాథమిక పాఠశాలలను శనివారం ఎంఈవో లోల శంకర్ తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. హెగ్డోలిలో 3వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ బోధన విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చలి కాలం.. జర భద్రం!

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ దాడి
- పెరుగుతున్న న్యుమోనియా, అస్తమా కేసులు

టేక్ కేర్

తాడ్వాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చల్లటి వాతావరణంలో జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఫ్లూ జ్వరం ఆయాసం, స్వైన్ ఫ్లూ కేసులు పెరు గుతున్నాయి. అస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డీసీజ్) అలర్జీ, న్యుమోనియా తదితర శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. శ్వాసకోశ వ్యా ధులతో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చెస్ట్, ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆసుపత్రుల ఓపీ విభాగానికి వచ్చే రోగుల్లో సీజన్‌కు సంబంధించిన కేసులు పెరుగుతున్నాయి.

వ్యాధులతో బాధపడే వారికి చలి కాలం కష్టమేనని వైద్యులు అంటున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా, ఏసీ గదుల్లో ఉన్నా అస్తమా సమస్య పెరుగుతుంది. చలి కాలంలో దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తే అస్తమా, న్యుమోనియా రోగులకు మరింత అసౌకర్యంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అస్తమా, న్యుమోనియాతో బాధపడే వారు మందులు వాడకపోతే సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తేమ శాతం

వాతావరణ మార్పులతో చల్లటి గాలులకు శరీరం తెల్లగా పొడి బారినట్లు మారిపోతోంది. పెదవులు పగిలిపోయి ముఖం కాంతి హీనంగా మారుతుంది. అరికాళ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయి. శరీరంలో తేమశాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తాయంటున్నారు. ముఖంపై పొడి భారిపోవడం వల్ల పగుళ్లు వస్తాయని వైద్యులు వివరించారు. చేతులపై పగుళ్ల మాదిరిగా తెల్లటి గీతలు వస్తాయంటున్నారు. ఈ తరహా సమస్యలు మధుమేహం రోగులకు వస్తే ఇబ్బందులుంటాయని, ఇన్‌ఫెక్షన్ పెరుగుతుందని పేర్కొంటున్నారు.

దగ్గు, ఆయాసం

వాతావరణం చల్లగా ఉండటంతో ప్రజలు సీవియర్ అలర్ట్ బ్రాంకైటీస్ బారినపడుతున్నారు. వాతావరణం మార్పుతో వైరస్ శక్తివంతం కావడంతో ప్రజలపై దాడి చేస్తోంది. దీంతో దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగింది. ఐదారు రోజుల్లో తగ్గే జబ్బు, అలర్జీలు ప్రస్తుతం వారం నుంచి రెండు వారాలు ఉంటున్నాయని వైద్యులు తెలిపారు. న్యుమోనియా, అస్తమా వంటి జబ్బులు కూడా పెరిగాయంటున్నారు.

అస్తమా ఉంటే అవస్థ

అస్తమా, న్యూమోనియా, సీవోపీడీ గుండె

నీరు వేడి చేసి తాగాలి

శ్వాసకోశ, చెవి, ముక్కు, గొంతు సమస్యలున్న వారు చలి కాలంలో జాగ్రత్తగా ఉండాలి. ఈనరు వేడి చేసి వడపోసు కుని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి, శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఐస్ క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతు నొప్పి ఉన్న వారు ప్రతిరోజు రెండుసార్లు వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కిలించి ఉమ్మి వేయాలి. ఐదారుసార్లు చేయాలి, ఇలా ఉదయం సాయంత్రం చేస్తే గొంతు నొప్పి తగ్గే అవకాశ ముంది. ఫ్రిజ్‌లో పెట్టిన నీరు తాగొద్దు, వేడి ఆహారం తీసుకోవాలి.

గుండె జబ్బు బాధితులు జాగ్రత్తగా ఉండాలి

చలి కాలంలో గుండె జబ్బులు ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలి. బ్లాక్స్, కొలెస్ట్రాల్ ఉన్న వారిలో రక్తనాళాల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉండటంతో గుండె వైఫల్యం చెందే ముప్పు ఉంటుంది. కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ల వల్ల కూడా రక్తనాళాలు రప్చర్ అవు తుంటాయి. చలి ఎక్కువగా ఉంటే వాకింగ్ చేయొద్దు. అధిక బరువు అస్తమా, గుండె జబ్బులున్న వారు వాకింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చలి కాలంలో స్మోకింగ్ చేయడం మానివేయాలి.



నిర్మాణంలో ఉన్న వంట గది | టాయిలెట్లు | ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు

సొంతూరుపై మమకారం.. అభివృద్ధికి సహకారం

- ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకున్న పూర్ణచందర్ రెడ్డి
- మరుగుదొడ్లు, వంటశాలకు రూ.లక్షల్లో సొంత ఖర్చు
- గ్రంథాలయం ఏర్పాటుకు సన్నాహాలు

నందిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరుకు ఏదో చేయాలని తపించాడు.. తాను స్థానికంగా చదవక పోయినా, కనీసం సొంతూరులో ఉన్న పాఠశాల అభివృద్ధికి పాటు పడాలని పూనుకున్నాడు... అంతే ఇక మదిలో మెదలగానే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించాడు. అంతటితో ఆగకుండానే ఆ పాఠశాలకు కావాల్సిన వసతులను సమకూర్చుతున్నారు. ఇప్పటికే సొంతంగా రూ.లక్షలు వెచ్చించి మరుగు దొడ్లు, టాయిలెట్లు నిర్మాంచారు. వంటశాల నిర్మాణంలో ఉంది. గ్రంథాలయం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల అండ దండలు ఉండడంతో బీసీ మహిళా హాస్టల్, గ్రామంలో సీసీ రోడ్లుకు నిధులు, ఎస్సీ హస్టల్ మరమ్మతులకు నిధులు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనే ప్రొద్దుటూరి పూర్ణచందర్ రెడ్డి అలియాస్ పురణ్ రెడ్డి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

నందిపేట మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన ప్రొద్దుటూరి పూర్ణచందర్ రెడ్డి ఎన్నో వ్యాపారాలు చేస్తున్నారు. డబ్బులు బాగానే సంపాదిస్తున్నా మదిలో వెలితి కనిపిస్తోంది. ఇంత సంపాదిస్తున్నా మనం ఊరుకు ఏం చేయలేక పోతున్నామని ఆయనకు ఆయనే ప్రశ్నించుకున్నారు. చివరకు ఊరు కు గాని, ఊళ్లో స్కూల్‌కుగాని సహకారం చేయాలనుకున్నారు. తన పుట్టిన ఊరు అభివృద్ధికి పాటు పడాలని తపిస్తున్నారు. ముందుగా ఊరులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదు పాయాలను కల్పిస్తున్నారు. ఇప్పటికే రూ.లక్షలు వెచ్చించి విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు, మరుగుదొడ్ల సముదాయం నిర్మించారు. వంటశాల నిర్మాణంలో ఉంది. గ్రామంలో యువత, నిరుద్యోగుల కోసం గ్రందాయం ఏర్పాటుకు గదులను అద్దెకు తీసుకు న్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో బంధుత్వం, సాన్నిహిత్యం ఉండ డంతో బాలికల బీసీ హస్టల్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారు. అంతే కాకుండా గ్రామంలో ఉన్న ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల హస్టల్ మరమ్మతులకు ప్రభుత్వ నిధులు తెచ్చేందుకు ప్రభుత్వ పెద్దలను ఇదివరకే కలిశారు.

ఊళ్లో పుట్టినందుకు సేవ చేస్తా..

- పి పూర్ణచందర్ రెడ్డి, ఐలాపూర్



ఐలాపూర్‌లో పుట్టినందుకు సేవా చేయాలని అనుకుంటున్నా. తాను స్థానికంగా చదువుకోలేక పోయినా గ్రామంలోని పిల్లలు చదువుకునేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తా. ఈ పాటికే మరుగు దొడ్లు, టాయిలెట్లు నిర్మించాను. వంటశాల నిర్మాణంలో ఉంది. పాఠశాలకు ఇంకా ఏమైనా కావాలంటే తాను సంపాదిస్తున్న దాంట్లో నుంచి ఏమేరకైనా ఖర్చు చేస్తా. ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు చేసి బీసీ బాలికల హస్టల్‌ను మంజూరు చేయించడం లక్ష్యంగా పెటుకున్నా. అంతేకాకుండా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు తెప్పిస్తా.

పాత నాణేలు, నోట్ల సేకరణ

- 35 ఏళ్లుగా సేకరిస్తున్న నవీపేట వ్యాపారి మహేష్ గుప్తా



మహేష్ సేకరించిన పాత కరెన్సీ నోట్లు



పాత నాణేలు

నవీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యెర్ర మహేష్ గుప్తా అనే వ్యాపారి చిన్నప్పటి నుండి పాత నాణేలు, నోట్లను సేకరించడం అలవాటుగా చేసుకున్నాడు. 35 ఏళ్లుగా వీటిని సేకరిస్తూ తన వద్ద వాటిని జాగ్రత్తగా భద్రపర్చుకున్నాడు. దేశానికి స్వాతంత్ర్యం రాక మునుపు నుంచి చెలామణిలో ఉన్న ఏక అణ, అర్థ అణ, అణతో పాటు స్వాతంత్ర అనంతరం చెలామణిలోకి వచ్చిన ఒక పైసా, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు పైసలు, పది పైసలు, 20పైసాలు, 25పైసాలు, 50పైసలు, ఒక్క రూపాయి, 2రూపాయలు, 5రూపాయల నాణేలు ఉన్నాయి. ఇందులో రాగి, వెండి, ఇత్తడి, అల్యూమినియంతో తయారైన అరుదైన నాణేలు ఉన్నాయి. వీటితో పాటు పలు దేశాలకు చెందిన నాణేలు కూడా సేకరించడం విశేషం. వీటితో పాటు ఒక్క రూపాయి, రెండు రూపాయలు, 5రూపాయలు, 10 రూపాయలు, 20 రూపాయలు, 50రూపాయలు, 100 రూపాయలతో పాటు ఇటీవల రద్దు అయిన 500రూపాయల నోట్లను సైతం సేకరించాడు. ఇందులో చాలా మట్టుకు పాత నాణేలతో పాటు నోట్లను నేటి తరానికి చెందిన పిల్లలు చూసి ఉండారు. ఇంతటి అరుదైన నాణేలు, నోట్లను యెర్ర మహేష్ సేకరించడం పట్ల స్థానికులు అభినందిస్తున్నారు. పాత నాణేలు, నోట్లను సేకరించడంలో నేటి యువతరానికి యెర్ర మహేష్ ఆదర్శంగా నిలుస్తున్నారు.



పాత నాణేలు, పాత నోట్లను చూపిస్తున్న యెర్ర మహేష్ గుప్తా

35ఏళ్లుగా పాత నాణేలు, నోట్లను సేకరిస్తున్నాను

యెర్ర మహేష్ గుప్తా, వ్యాపారి, నవీపేట



నేను గత 35 సంవత్సరాలుగా పాత నాణేలు, నోట్లను సేకరించడం అలవాటు చేసుకున్నాను. స్వాతంత్ర రాక ముందు అమలులో ఉన్న నాణేలతో పాటు స్వాతంత్రం వచ్చిన తర్వాత చెలామణిలోకి వచ్చి మధ్యలో కనిపించకుండా పోయిన నాణేలు సైతం నేను సేకరించాను. అలాగే పలు దేశాలకు చెందిన నాణేలను సైతం సేకరించడం జరిగింది. వీటితో పాటు పాత నోట్లను సైతం సేకరించాను. పాత నాణేలు, నోట్లను సేకరించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

సమీకృత మార్కెట్‌కు గ్రహణం

భీమ్‌గల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి), భీమ్‌గల్ మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత ప్రజల సౌకర్యార్థం పట్టణ కేంద్రంలో ఇరుకు ఇరుకుగా కొనసాగుతున్న కూరగాయలు, మాంసం మార్కెట్‌ను ఒకే చోట ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలన్న ఉద్దేశంతో పాత తహసీల్దార్ కార్యాలయం వేతనాల సమీకృత మార్కెట్ నిర్మించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రణాళిక చేపట్టి ఇందుకు మూడు కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ పనులకు అప్పటి మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి 7 డిసెంబర్ 2021 నాడు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 50 శాతం కూడా పనులు పూర్తి కాక మూలన పడ్డాయి. ప్రస్తుతం నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు అధికారులు తెలుపుతున్నారు. లక్షలు వెచ్చించి లక్షణంగా పనులు మరుస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఇరుకు మార్కెట్‌తో ఇబ్బందులు..

పట్టణ కేంద్రంలో కూరగాయల మార్కెట్ ప్రధాన రోడ్డుపై కొనసాగడంతో ప్రతినిత్యం ఆ దారిన నడిచే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా మార్కెట్‌కు వచ్చే వారు వాహనాలన్నీ రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. సమీకృత మార్కెట్ ఏర్పాటు కల కలగానే మిగిలి పోతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమీకృత మార్కెట్ ను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో సోమవారం సంత రోజు కూరగాయల వ్యాపారులు, మరి ఇతర వ్యాపారస్తులు రోడ్డుపై దుకాణాలు పెట్టడంతో మరింత ఇబ్బంది తలెత్తుతుంది.

కూరగాయలు, మాంసం మార్కెట్‌లను ఒకే చోట ఏర్పాటు చేయాలి..

బట్టు అనిల్, భీమ్‌గల్



ప్రభుత్వం కూరగాయల మాంసం మార్కెట్‌ను ఒకే చోట ఏర్పాటు చేస్తే ప్రజలందరికీ సౌకర్యంగా ఉంటుంది. రోడ్డుపై మార్కెట్ కొనసాగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కావున సమీకృత మార్కెట్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి మార్కెట్‌ను ఇక్కడికి తరలించాలి.

నిధులు విడుదల చేస్తే పనులు పూర్తి చేస్తాం..

రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్, భీమ్‌గల్



గతంలో నిధులు విడుదలైన మట్టుకు పనులు జరిగాయి. ప్రస్తుతం నిధులు విడుదల కాకపోవడంతో పనులు కొంత మేర నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి న వెంటనే పనులు పూర్తి చేస్తాం.



మధ్యలోనే నిలిచిపోయిన సమీకృత మార్కెట్ నిర్మాణ భవనం



శిలాఫలకం



రోడ్డుపై కూరగాయల మార్కెట్‌తో జనం రద్దీ

పత్తి కొనుగోళ్లలో నిబంధనలకు నీళ్లు



పత్తి విక్రయానికి వచ్చిన వాహనాలు

- లైసెన్స్ లేకపోయినా దర్జాగా దందా
- ఇష్టారాజ్యంగా కమీషన్ వసూలు
- నష్టపోతున్న రైతులు

మద్నూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలోని పత్తి మార్కెట్‌లో ప్రైవేట్ కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి ఇష్టారాజ్యంగా కమీషన్ వసూలు చేస్తూ రైతులకు నష్టపరుస్తున్నారు. మార్కెట్ విధించిన నిబంధనలకు నీళ్లు వదులు తున్నారు. దీంతో ఆరు గాలం కష్టపడి పండించిన రైతన్న నష్టపోతున్నారు. కామారెడ్డి జిల్లాలోని మద్నూర్ మండల కేంద్రంలో పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో కమీషన్ల దందా కూడా జోరుగానే సాగుతుంది. కొందరు లైసెన్స్‌లు లేకుండా పత్తి కొనుగోలు సాగిస్తుండగా మరికొందరు మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన కమీషన్ కంటే అదనంగా వసూలు చేసి దందా సాగిస్తున్నారు. దీంతో వ్యాపారులకు, రైతులకు మధ్య గొడవ తలెత్తుతుంది. జిల్లాలోని మద్నూర్ మార్కెట్‌లో పత్తి వ్యాపారం ప్రతీ ఏడాది వేల కోట్ల రూపాయల వరకు జరుగుతుంది. గుంటూరు, కోయం బత్తూరు, గుజరాత్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి పత్తి ఎగుమతి అవుతుంది. ఇక్కడ ఉన్నటువంటి 11 జిన్నింగ్ మిల్లుల్లో జిన్నింగు అనంతరం వచ్చిన రూయిని ఎగుమతి చేస్తుంటారు. ఈ ప్రాంతంలో నల్లరేగడి భూములు అధికంగా ఉండటంతో పత్తి పంట అధికంగా పండటంతో పాటు నాణ్యతగా కలిగి ఉంటుంది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మద్నూర్ పత్తిని కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతారు. ప్రతీ ఏడాది ప్రభు త్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి గాను సీసీఐ కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది కూడా 8 సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పత్తి వ్యాపారం ఇక్కడ ముమ్మరంగా సాగుతుంది. వాస్తవానికి కమిషన్ వ్యాపారి లైసెన్సు తీసుకున్న వారు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసి క్వింటాల్‌కు రూ.1.56 చొప్పున కమిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. మార్కెట్‌కు క్వింటాల్‌కు రూపాయి చొప్పున వ్యాపారులు చెల్లించాల్సి ఉంటుంది. ఇది మార్కెట్ శాఖ నిబంధన అయితే కమీషన్ వ్యాపారులు రైతుల నుంచి రూ.4కు పైగా వసూలు చేస్తున్నారు. కొంత మంది రైతులకు పెట్టుబడి పెట్టిన చోట కమీషన్ రూ.5 కూడా తీసుకుం టున్నారు. ఇదంతా అనధికారికంగా సాగుతున్న దందా మార్కె టింగ్ శాఖ వద్ద కొనుగోలుదారుల కింద ట్రేడింగ్ లైసెన్సులు మరి కొందరు కమీషన్ దారులు లైసెన్స్‌లు తీసుకొని పత్తి కొనుగోళ్లలో పాల్గొనాల్సి ఉంటుంది. ట్రేడింగ్ లైసెన్స్ కలిగిన వ్యాపారులు రైతుల వద్ద కమీషన్ తీసుకోకూడదు. కమీ షన్ వ్యాపారులు మాత్రమే రైతులకు కొనుగోలుదారులకు మధ్య కమీషన్ ఏజెంట్లకు మార్కెటింగ్ శాఖ నిబంధనల ప్రకారం కమీషన్ తీసుకోవాల్సి ఉంది. లైసెన్స్‌లు లేకపోయినా వేరే వారి లైసెన్స్ పేర్లతో కొందరు ఉండగా, కమీషన్ వ్యాపారి లైసెన్స్ లేకుం డా పత్తి కొనుగోలు చేయించి కమీషన్ వ్యాపారి లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేయించి కమీషన్ కూడా అధికంగా గుంజుతున్న ఏజెంట్లు కూడా అధికంగానే ఉన్నారు. మద్నూర్ వ్యవసాయ మార్కెట్‌లో వందకుపైగా కమీషన్ ఏజెంట్లు ఉండగా ట్రేడింగ్ లైసెన్స్ కలిగిన వారు 8 మంది కమీషన్ ఏజెంట్‌లుగా లైసెన్స్ పొందిన వారు 19 మంది ఉన్నారు. ప్రైవేట్ వ్యాపారం చేస్తూ కమీషన్ ఏజెంట్లుగా రైతుల నుంచి పత్తి కొనుగోలు వారి వద్ద నుంచి అధికంగా కమీషన్ చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కమీషన్ ఏజెంట్లు లైసెన్స్ లేకుండా రైతుల నుంచి కమీషన్ తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ లైసెన్స్‌లు లేకుండానే రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. మార్కెటింగ్ శాఖకు ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం నిబంధనల మేరకు క్వింటాల్‌కు రూపాయి చొప్పున మార్కెటింగ్ శాఖకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్స్‌లు లేకపోవడం వల్ల కొనుగోలు చేసిన దాని లావాదేవీలు తెలవకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.


మద్నూర్ మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- మద్నూర్ మండల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే

మద్నూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శనివారం మద్నూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలం లోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో గ్రామ సమస్యల గురించి ఎమ్మెల్యే చర్చించారు. అంగన్‌వాడీ భవనాలు, సబ్ స్టేషన్, విద్యుత్ స్తంభాలు, నీటి సౌకర్యం రోడ్డు కాంపౌండ్ వాల్స్ పాఠశాల భవనాలు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చుతామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నదం కావాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే ప్రతీ ఒక్కరికి గుర్తింపు ఉంటుందని అన్నారు.

మద్నూర్ మండలానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

మద్నూర్ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం 26 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసిందని, వాటిలో జుక్కల్ నియోజకవర్గం ఒకటని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

'ఎమ్మెల్యేవి నిరాధరణమైన ఆరోపణలు'


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బిచ్కుంద, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుల పై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ మాట్లాడిన మాటలు నిరాధారమైనవని మాజీ ఎంపీటీసీలు సురేష్, మొగులయ్య అన్నారు. బిచ్కుందతో పాటు పలు మండలాల్లో సీనియర్ నాయకులను చిన్నచూపు చూడడమే కాకుండా ప్రసంగాలలో నిరాధారణమైన ఆరోపణలు చేయడం ఎమ్మెల్యే స్థాయికి తగదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న లేకున్న పార్టీకోసమే పనిచేస్తు ఎన్నో సవాళ్లను ఎదుర్కోన్నామని పార్టీ దెబ్బతినేలా ఎవరు ప్రవర్తించిన సహించేది లేదని పార్టీ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. సీనియర్లపై చేసిన ఆరోపణలు నిరూపణకు బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాష, విమల్, వీరేందర్ పాల్గొన్నారు.

ప్రతీ వార్డును శుభ్రంగా ఉంచాలి


కార్మికుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న చైర్‌పర్సన్

కామారెడ్డి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌లోని ప్రతీ వార్డును శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆమె జన్మదిన వేడుకలను మున్సిపల్ కార్మికులు, సిబ్బంది నిర్వహించగా కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం తన జన్మదిన వేడుకలు కార్మికులతో కలిసి జరుపుకోవడం సంతోషంగా ఉందని తాను కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. అనంతరం మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రాజనర్సు మాట్లాడుతూ కార్మికులకు అన్ని రకాలుగా ఆదుకోవడమే కాకుండా భిక్షపతి అనే కార్మికునికి కంటికి గాయమైతే చైర్‌పర్సన్ దగ్గరుండి కార్మికునికి హైదరాబాద్‌లో చికిత్స చేయించడమేకాకుండా ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు అనుష, పాత శివకృష్ణమూర్తి, పంపరి లత, శ్రీనివాస్, మొయినొద్దిన్, సలీం, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విగ్రహాల ప్రతిష్ఠ

తాడ్వాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్యాల గ్రామంలో భవాని నాయకమ్మ ఆలయంలో శాశ్వత ధర్మకర్త అంబీరు శ్రీహరి రావు పాటిల్, ఇందిరాబాయ్ జ్ఞాపకార్థం విగ్రహాలను నిర్మించారు. అనంతరం తల్లి దండ్రుల సేవలను కుమారులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబీర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


భవాని నాయకమ్మ ఆలయంలో విగ్రహాలు ఏర్పాటు చేసిన దృశ్యం

కుల గణన సర్వేను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- కుల గణన నమోదును త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- అధికారుల తీరుపై ఆగ్రహం
- సామాజిక ఆర్థిక కుల గణన సర్వే రాష్ట్ర పరిశీలకులు దీప్తి


కుల గణన సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర పరిశీలకురాలు దీప్తి

తాడ్వాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక కుల గణన సర్వే తీరును శనివారం రాష్ట్ర పరిశీలకులు దీప్తి మండల కేంద్రంలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సర్వే చేసిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరలో కంప్యూటర్‌లో ఆన్‌లైన్ నమోదు చేయాలని తెలిపారు. కుల గణనపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు. కుల గణన ఆన్‌లైన్‌లో మందకొడిగా సాగుతుందని త్వరగా పూర్తి చేయాలని అధికారు లకు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చేపడుతుందని ఎటువంటి ఆటంకాలు కలుగకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామాల్లోని కార్యదర్శులు సరిగ్గా చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా తీరును మార్చుకొని సక్రమంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేక అధికారి రాజారాం, మండల అధికారి సయ్యద్ సాజీద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిఘా ఉంచాలి

- ఘర్షణ పడ్డ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు
- ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాలలో ఘర్షణ పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో శుక్రవారం ఓ సంఘటనలో విద్యార్థుల మధ్య ఘర్షణ అయినట్లు సమాచారం మేరకు శనివారం డీఎస్పీ శ్రీనివాసులు, ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేష్‌ను పాఠశాలలో జరిగిన సంఘటనపై విచారణ చేయాలని ఆదేశించారు. దీంతో పోలీసులు దిగి విద్యార్థుల మధ్య గొడవ అయిన సంఘటనపై ఆరా తీసి విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి స్నేహభావంతో కలిసిమెలిసి ఉండి లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం జీవన్ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని డీఎస్పీ ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించి విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిఘా ఉంచాలని, ఘర్షణకు తావు లేకుండా చూసి చదువుపై దృష్టి పెట్టేలా ఉండాలని మరోసారి ఇలాంటి సంఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీ పరామర్శ

దోమకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):దోమకొండ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ తల్లి సత్తమ్మ ఇటీవలే మరణించింది. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ శనివారం దోమకొండకు చేరుకుని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, గ్రంథాలయశాఖ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, తీగల సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు, మధు, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, లింగం, శ్రీనివాస్, రవి, కలీం, నయిమ్, షమ్మీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

సదాశివనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వజ్జపల్లి మాజీ సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉపసర్పంచ్ ప్రభాకర్ అన్నారు. శనివారం గ్రామానికి చెందిన అశ్వినికి కానిస్టేబుల్ జాబ్ రావడంతో గ్రామప్రజల సమక్షంలో ఆమెను సన్మానించారు. అశ్వినిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన యువతులు సైతం మరిన్ని ఉద్యోగాలు సాధించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నన్న, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ రామారెడ్డి, అగస్త్య కంపెనీ సెల్ ఆఫీసర్ రవీందర్‌రావు, కాంగ్రెస్ యువ నాయకుడు గణేష్‌రావు, బీఆర్ఎస్ గ్రామఅధ్యక్షుడు శ్రీను, మహిపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

సదాశివనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవాలని మండల విద్యాధికారి యోసప్ అన్నారు. నూతన ఉపాధ్యాయులకు శనివారం సేవ పుస్తకాలను పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూకంటి బాపురెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్‌సీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగం సంపాదించి నలుగురికి ఆదర్శంగా నిలిచినందుకు వారి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు రాజిరెడ్డి, బసంత్‌రాజ్, సాయిరెడ్డి, బిల్యారాజు, హన్మంత్‌రెడ్డి, సహేందర్, నరేందర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో పీజీటీ బోటనీ బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 25వ తేది లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గాంధీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ బోటనిలో పీజీ, బీఈడీ చేసిన వాళ్లు దీనికి అర్హులని అన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధించాల్సి ఉంటుందని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

సమగ్ర సర్వేలో 14 వేల 423 దరఖాస్తులు

- ప్రారంభమైన ఆన్‌లైన్ వివరాలు


లింగంపేటలో సమగ్ర సర్వే ఫారాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

లింగంపేట, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిందని మొత్తం 14423 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో నరేష్ తెలిపారు. దరఖాస్తులను జీవదాన్ పాఠశాలలో ఆన్‌లైన్ నమోదును ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా డాటా ఎంట్రీ ఆపరేటర్లతో పూర్తి చేస్తున్నామని ఆన్‌లైన్ పక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఆయన తెలిపారు.

నసురుల్లాబాద్ ప్రఖండ కమిటీ ఎన్నిక


నసురుల్లాబాద్ ప్రఖండ నూతన కమిటీ ఇదే..

నసురుల్లాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని హిందూ సంస్కృతి సంప్రదాయాలని కాపాడాలని విశ్వ హిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ భజరంగ్ దళ్ నసురుల్లాబాద్ ప్రఖండ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అరిగే నారాయణ, ఉపాధ్యక్షులుగా అరెల్లి సునీల్‌గౌడ్, కోశాధికారిగా అంజయ్య, కార్యదర్శి శివసాగర్, సత్సంగ్ ప్రముఖ్ రాఘవ, ధర్మ ప్రసాద్, వినోద్, సంయోజక్‌గా నాగరాజు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా త్రి ప్రఖండ సంఘటన మంత్రి వినోద్‌కుమార్, జిల్లా గో రక్షక్ తులసి దాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజంపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవన్నపల్లి, కొండాపూర్,ఎల్లారెడ్డిపల్లి, గుండారం, ఎల్లాపూర్ తండా, షేర్ శంకర్ తండా గ్రామాల్లో శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్‌రెడ్డి తెలిపారు.

ఆధార్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో


ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని శనివారం ఆర్డీవో మన్నె ప్రభాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నమోదు చేసుకునే వారి వివరాలు, మార్పులు, చేర్పులు చేసుకునే వారికి వివరాలు గాని తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆధార్ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. ఆధార్ కేంద్రానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పట్టణ కేద్రంలోని 243, 245, 250 పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అల్లం మహేందర్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో బీజేపీ నాయకుల సంబరాలు


మద్నూర్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

మద్నూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ, శివసేన కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మద్నూర్ మండలానికి సరిహద్దుల్లో ఉన్న దెగ్లూర్, బిలోలి నియోజకవర్గం పరిధిలో బీజేపీ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుపొందగా నాందేడ్ జిల్లా పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ స్థానాలలో కూడా బీజేపీ, శివసేన కూటమి అభ్యర్థులు విజయం సాధించడంపై కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలో బీజేపీ మహిళల కోసం ప్రత్యేకంగా లాడికే బహిన్ పథకాన్ని ప్రారంభించగా ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆకట్టుకున్నట్లు ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయన్నారు. సంబరాలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


సత్య గార్డెన్‌లో జోయాలుకాస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకు

ఆకర్షిస్తున్న జోయాలుకాస్ ఎగ్జిబిషన్

కామారెడ్డిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్‌లో జోయాలుకాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ కం సేల్స్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ అందరినీ ఆకర్షిస్తుంది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ ప్రజాదరణ పొందిన జోయాలుకాస్‌ను కామారెడ్డి ప్రజలకు పరిచయం చేసేందుకు వేదికను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ నాణ్యతకు, మన్నికకు మారుపేరైన జోయాలుకాస్ కామారెడ్డి ప్రజల దగ్గరకు వచ్చిందని 1లక్ష అంతకంటే ఎక్కువ గోల్డ్ జ్యువెలరీ కొనుగోళ్లపై 10 గ్రాముల వెండి నాణెం ఉచితంగా అందిస్తామని తెలిపారు. డైమండ్స్, అన్‌కట్ డైమండ్స్ ప్రైషస్ స్టోన్స్ విలువపై 25 శాతం తగ్గింపు ఉంటుందని తెలిపారు. ఆది, సోమ వారాల్లో ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజినల్ మేనేజర్ ఆంథోథామస్, ప్రాంతీయ మేనేజర్ వినయ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్, ప్రాంతీయ అసిస్టెంట్ మేనేజర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించాలి


కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దోమకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించే బాధ్యత ఉపాధ్యాయులదే అని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని సీతారాంపల్లి కస్తూర్బగాంధీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు నిరసన తెలుపడం, దానికి సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఆఫీసర్‌చ ఉపాధ్యాయులు సమన్వయంతో ఉంటూ విద్యార్థులకు ఉన్నత చదువును అందించాలని సూచించారు. భోజనం విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎదైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో విజయ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ మంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొని కారు బోల్తా.. ఒకరి మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

దోమకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆకోలా-సంగారెడ్డి 161 జాతీయ రహదారిపై గేదెను ఢీకొని కారు బోల్తా పడింది. జాతీయ రహదారి పిట్లం సమీపాన హైదరాబాద్ నుండి నాందేడ్ వెళ్తున్న కారుకు పిట్లం వద్ద గేదె అడ్డు రావడంతో కారు బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతి చెందారని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి రహదారి అంబులెన్స్‌లో రావడంతో పోలీసులు కారులో గాయాలైన ముగ్గురికి పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ నుంచి నాందెడ్ వైపు కారులో నలుగురు వెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాల య్యాయి. ప్రమాదంపై పూర్తి వివరాలు సేకరించి వివరాలు తెలుపుతామని పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఎల్లారెడ్డి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ రూ.13 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. శనివారం ఎల్లారెడ్డి మండలంలోని పెద్దారెడ్డి గ్రామానికి చెందిన పెద్దమ్మ గారి రవీందర్‌రెడ్డి అనారోగ్యంతో డయాలసిస్‌తో ఇబ్బంది ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకుని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కుమ్మరి నాగయ్య భార్య సిద్దవ్వ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి మూడు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా పూసల దినాకర్ తండ్రి రామస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతోత వారిని పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించి మూడు వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే బహిరంగ జరమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని వారిని పరామర్శించి వైద్యం ఖర్చుల కోసం రెండు వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఎండీ యాసీన్, యూత్ అధ్యక్షుడు కృష్ణానందం, మాజీ సర్పంచ్ నారాగౌడ్, సొసైటీ డైరెక్టర్ సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్, పాండు, ప్రవీణ్, పద్మారావు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

ఆదాయాభివృద్ధికి వినియోగించుకోవాలి

రాజంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య సమావేశాన్ని శనివారం నిర్వహించినట్లు ఏపీఎం సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల సంఘాల పరిధిలో గల చిన్న సంఘాలు సక్రమంగా సమావేశాలు నిర్వహించి పుస్తక నిర్వహణ చేసుకోవాలని తెలిపారు. సంఘం నుంచి తీసుకునే ప్రతీ అప్పు కూడా ఆదాయాభివృద్ధికి వినియోగించాలని ఎవరైనా సభ్యులు మొండి బకాయిలు ఉన్న వారి నుంచి రికవరి చేయించాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో చిన్నసంఘ సభ్యులకు రెండు లక్షల బ్యాంకు అప్పు నిల్వ ఉన్న వారికి లోన్ బీమా, సంఘంలో ఉన్న ప్రతీ ఒక్క సభ్యురాలికి ప్రమాద బీమా కూడా ఉందని గ్రామాల్లో సంఘంలో లేని సభ్యులను సంఘాల్లో చేర్పించడం, పెరిటి కోళ్ల, చేపల పెంపకం, గేదెల పెంపకం గురించి వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, సీసీలు సాయిలు, బాలయ్య, రమేష్, స్వామి, అకౌంటెంట్ ప్రశాంతి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి

కామారెడ్డిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు రజినికాంత్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని సుమారు 8200 కోట్లకు పైగా మూడేళ్ల నుంచి విద్యార్థులకు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, నాయకులు అజయ్, మణికంఠ, రాహుల్, నితిన్, సాయికృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	దేవకి నందన వాసుదేవ
దర్శన్	జిబ్రా
ప్రియా 35	అమరన్
ప్రియా 70	మెకానిక్ రాకీ

బాన్సువాడ	
మహేశ్వరి	కంగువా
వెంకటేశ్వర	అమరన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	130	160	190

